సాక్షి ప్రకాశం

బుధవారం ı 1 ı అక్టోబర్ ı 2025

I



హైలెవెల్ వ్యాపారం

ఒంగోలులోని హైదరీక్లబ్‌లో వందల ఏళ్ల నాటి భారీ వృక్షాలను నరికివేసి పర్యావరణ నిబంధనలకు పాతరేశారు. - IIలో..



భారం కాదు.. బాధ్యత

సమాజంలో వృద్ధులపై చిన్నచూపు చూస్తున్నారు. నేడు అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా కథనం. - IIలో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33 /26

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

దుర్గతి నాశిని.. సద్గతి దాయని




దుర్గాదేవి అలంకారంలో త్రిపురాంతకంలోని బాలాత్రిపురసుందరీదేవి

దుష్ట సంహారిణి..శిష్ట రక్షణిగా లోకాలను కాపాడే ముగ్గురమ్మల మూలపుటమ్మ దుర్గాదేవిని శరన్నవరాత్రులలో భక్తులు దుర్గాష్టమి రోజున ప్రత్యేకంగా అలంకరించి అర్చించారు. అమ్మవారికి ప్రీతిపాత్రమైన మంగళవారం కూడా కలసిరావడంతో మహిళలు పెద్ద ఎత్తున ఆలయాలను దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

- సాక్షి, ఒంగోలు

నెత్తిన బండేశారు..

రామతీర్థంలోని గ్రానైట్ క్వారీ, గ్రానైట్ రాళ్ళు



గ్రానైట్ పరిశ్రమలను ఆదుకుంటామని యువగళం పాదయాత్ర సందర్భంగా నిర్వహించిన గ్రానైట్ పరిశ్రమల యజమానుల సదస్సులో నారా లోకేష్ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక హామీలు మరిచారు. అంతంత మాత్రంగా ఉన్న గ్రానైట్ ఫ్యాక్టరీల మనుగడనే ప్రశ్నార్థకరంగా మార్చేలా ప్రైవేటు పెత్తనానికి పచ్చజెండా ఊపింది చంద్రబాబు సర్కార్. దీనిపై పరిశ్రమల యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో నష్టాల పాలవుతామని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేటు పెత్తనాన్ని సహించబోమంటూ బుధవారం నుంచి పరిశ్రమలు మూసివేతకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వం న్యాయం చేసే వరకూ ఫ్యాక్టరీలు తెరవబోమని తెగేసి చెబుతున్నారు.

- నేటి నుంచి జిల్లాలోని అన్ని గ్రానైట్ ఫ్యాక్టరీలు బంద్
- ఏఎంఆర్ సంస్థకు మేలు జరిగేలా నిర్ణయం తీసుకుందని ఆరోపణలు
- ఈ నిర్ణయంతో ఆర్థికంగా కుదేలవుతామంటున్న యజమానులు
- ప్రభుత్వ చర్యలపై యజమానుల ఆగ్రహం
- ఎన్నికల ముందు లోకేష్ ఇచ్చిన హామీలు గాలికి
- ప్రభుత్వం న్యాయం చేసే వరకు ఫ్యాక్టరీలను తెరిచే పనేలేదు
- అధికారులతో ఒప్పందాన్ని 9వ తేదీకి వాయిదా వేసుకున్న ఏఎంఆర్ సంస్థ

చీమకుర్తి:

ఉరుము ఉరిమి మంగళంపై పడినట్టు గ్రానైట్ పరిశ్రమపై ఏఎంఆర్ ప్రైవేటు కంపెనీ విధి విధానాల పిడుగు పడ్డట్టయింది. ప్రభుత్వం, ఏఎంఆర్ కంపెనీ సంయుక్తంగా గ్రానైట్ పరిశ్రమపై దోపిడీకి తెరతీయడం గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానులను ఆగ్రహానికి గురిచేసింది. అంతంత మాత్రంగానే ఉన్న వ్యాపారులను ప్రభుత్వం కోలుకోలేని దెబ్బతీసేలా చర్యలు తీసుకుంటోందని ఫ్యాక్టరీ యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా ఆర్థికంగా కుదేలయ్యే పరిస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకూ ఉన్న స్లాబ్ విధానంలో గ్రానైట్ ఫ్యాక్టరీల్లో సింగిల్ బ్లేడ్ పై రూ.27 వేలు, మల్టీ బ్లేడ్‌పై రూ.54 వేలు చెల్లించే వారు. ఈ నెల 1వ తేదీ నుంచి అమలు కానున్న కొత్త విధానాలతో సింగిల్ బ్లేడ్‌పై అదనంగా రూ.8 వేలు అంటే జీఎస్టీ మొత్తం కలిపి రూ.35 వేలు, మల్టీ బ్లేడ్‌పై అదనంగా రూ.16 వేలు కలుపుని రూ.70 వేలతో పాటు జీఎస్టీ అదనంగా చెల్లించాల్సి వస్తోంది. ప్రభుత్వం జారీ చేసిన జీఓ గ్రానైట్ ఫ్యాక్టరీల మనుగడకే ప్రశ్నార్థకంగా తయారైంది. దీంతో ఫ్యాక్టరీల యజమానులు మంగళవారం చీమకుర్తిలో సమావేశమై ఈనెల 1వ తేదీ బుధవారం నుంచి జిల్లాలోని అన్ని ఫ్యాక్టరీలను మూసేయాలని తీర్మానించారు. ప్రైవేటు ఏఎంఆర్ కంపెనీకి మేలు చేసేలానే ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

30 వేల మంది కార్మికులపై ప్రభావం..

చీమకుర్తి మండలంలోని చీమకుర్తి, ఆర్ఎల్‌పురం, బూదవాడ, ఏలూరు రోడ్డు పరిధిలోని నాలుగు గ్రానైట్ ఫ్యాక్టరీల సంఘాలకు సంబంధించి సుమారు 1200 గ్రానైట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. అవన్నీ బుధవారం నుంచి మూతపడనున్నాయి. తీర్మానాలలో ఇక నుంచి ప్రభుత్వానికి మైనింగ్ బిల్లులు చెల్లించకూడదని, క్వారీల నుంచి ముడి రాయిని కొనుగోలు చేయొద్దని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా బంద్ సందర్భంగా ఫ్యాక్టరీలను మూసేయాలని ఫ్యాక్టరీ యజమానులు తీర్మానం చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 2500 ఫ్యాక్టరీలు ఉన్నట్లు అంచనా. వాటిలో ఆంధ్ర, తెలంగాణ, రాజస్థాన్, బీహార్, ఒడిశాతో పాటు పలు రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు దాదాపు 30 వేల వరకూ ఉంటారు. ఫ్యాక్టరీలను మూసేస్తే వీరి జీవనోపాధిపై ప్రభావం చూపుతుందని కార్మిక సంఘాలు ఆందోళన చెందుతున్నాయి.



గ్రానైట్ ఫ్యాక్టరీలను మూసేస్తాం అంటూ తీర్మానం చేసిన ఫ్యాక్టరీల సంఘం నాయకులు

ప్రైవేటు దోపిడీ వెనుక మతలబు ఏమిటీ?

ప్రకాశం జిల్లాలోని గ్రానైట్, దాని అనుబంధ మినరల్స్‌పై ఇప్పటి వరకు ప్రభుత్వమే నేరుగా సీనరేజీ వసూలు చేస్తోంది. దాని ద్వారా మేజర్ మినరల్స్ (ఇసుక)ను మినహాయిస్తే గ్రానైట్, గ్రావెల్ ఇతర చిన్నా చితక మినరల్స్‌పై ప్రభుత్వానికి ప్రస్తుతం ఏడాదికి రూ.500 కోట్లు వంతున రెండేళ్లకు రూ.1000 కోట్లు రాయల్టీ వస్తోంది. అలాంటిది ఇప్పటి వరకు ఉన్న సీనరేజి రాయల్టీ వసూళ్లలో ఉన్న సూపర్ గ్యాంగ్‌సా, గ్యాంగ్‌సా, కట్టర్ సైజు, ఖండాస్ అనే నాలుగు రకాలు గ్రానైట్ బ్లాకులను రెండు రకాలుగా విభజించి సీనరేజిలో కూడా సగానికి పైగా తగ్గించి ఏఎంఆర్ కంపెనీకి మేలు చేసేందుకు ప్రభుత్వం జీఓ నెంబర్ 100ను గడిచిన జూన్ నెలలోనే జారీ చేసింది. ఆ తర్వాత ప్రభుత్వంతో అవగాహన కుదిరిన ఏఎంఆర్ కంపెనీ నెలకు రూ.47 కోట్లు చొప్పున రెండేళ్లకు రూ.1135 కోట్లు చెల్లించేందుకు సుముఖత వ్యక్తం చేసి జిల్లాలో రాయల్టీ వసూలుకు ఏర్పాట్లు చేసుకుంది. దానిలో భాగంగానే రెండు రోజుల క్రితం ఒంగోలులో గ్రానైట్ క్వారీల యజమానులతోను, అనంతరం ఫ్యాక్టరీల యజమానులతో ఏఎంఆర్ కంపెనీ చర్చించింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అధికారికంగా చెల్లించాల్సిన రాయల్టీతో పాటు అనధికారకంగా ఒక్కో ఫ్యాక్టరీలోని సింగిల్ బ్లేడ్‌కు రూ.35 వేలు చెల్లించాలని ఏఎంఆర్ కంపెనీ డిమాండ్ చేయటంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ఫ్యాక్టరీల యజమానులు అసలు మేము ఫ్యాక్టరీలనే నడపమని, ఫ్యాక్టరీలను మూసేస్తున్నామనే నిర్ణయాన్ని తీసుకున్నారు. ఏఎంఆర్ కంపెనీ పరిస్థితి కుడితిలో పడిన ఎలుక మాదిరిగా మారింది. ఏం చేయాలో తెలియక గత నెల 29న మైన్స్ అధికారులతో చేసుకోవాల్సిన ఒప్పందం ఈ నెల 9వ తేదీ లోపు చేసుకుంటామని ఏఎంఆర్ కంపెనీ యూటర్న్ తీసుకుంది.



ఎగుమతికి సిద్ధంగా ఉన్న గ్రానైట్ శ్లాబులు

మాట మరిచిన లోకేష్..

యువగళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేష్ సంతనూతలపాడు నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రానైట్ పరిశ్రమ యజమానులతో సదస్సు నిర్వహించారు. తాము అధికారంలోకి వస్తే పరిశ్రమను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక అందుకు భిన్నంగా వ్యవహరించి మాట మరిచారని పరిశ్రమల నిర్వాహకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇచ్చిన మాట నెరవేర్చిన జగన్...

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చీమకుర్తి వచ్చారు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి గ్రానైట్ పరిశ్రమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గ్రానైట్ పరిశ్రమలను ఆదుకుంటామని చీమకుర్తి సభలో జగన్ హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం స్లాబ్ సిస్టంను తీసుకొచ్చారు. దీంతో గ్రానైట్ పరిశ్రమలు ఆర్థికంగా నిలదొక్కుకున్నాయి.

నేటి నుంచి గ్రానైట్ ఫ్యాక్టరీలను మూసేస్తున్నాం...

ఏఎంఆర్ ఒప్పందంలోని అదనపు భారం కారణంగా ఈ రోజు నుంచి గ్రానైట్ ఫ్యాక్టరీలను మూసేయాలని ఫ్యాక్టరీల సంఘం తీర్మానించింది. ఇప్పటికే అంతంత మాత్రంగా ఉన్న గ్రానైట్ ఫ్యాక్టరీలపై ప్రైవేటు కంపెనీలకు సీనరేజి వసూళ్ల బాధ్యతను ప్రభుత్వం ఇవ్వడం వలన ఫ్యాక్టరీ మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

- యర్రగుంట్ల శ్రీనివాసరావు, ఫ్యాక్టరీల సంఘం నాయకుడు

ఈనెల 9లోపు ఒప్పందం చేసుకుంటారు...

వాస్తవానికి గతనెల 29న మైన్స్ అధికారులతో ఏఎంఆర్ కంపెనీ ఒప్పందం చేసుకోవాల్సి ఉంది. దానిని ఈనెల 9వ తేదీ లోపు అగ్రిమెంట్ చేసుకుంటామని ఆ కంపెనీ వారు తెలిపారు.

- టీ.రాజశేఖర్, మైన్స్ డీడీ, ఒంగోలు

న్యూస్‌రీల్

రోల్ ఆఫ్ పప్పెట్రీ ఇన్ ప్రైమరీ ఎడ్యుకేషన్‌పై శిక్షణ



ఎన్‌సీఈఆర్టీ డైరెక్టర్ నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న వై మంజుల

ఒంగోలు సిటీ: సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రైనింగ్ సంస్థ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 11 రాష్ట్రాల నుంచి ఎన్‌సీఈఆర్టీ ద్వారా ఎంపిక చేసిన 68 మంది ఉపాధ్యాయులకు రోల్ ఆఫ్ పప్పెట్రీ ఇన్ ప్రైమరీ ఎడ్యుకేషన్‌పై శిక్షణ శిబిరం ఢిల్లీలో నిర్వహించారు. గత నెల 10 నుంచి 24 వరకు జరిగిన ఈ శిక్షణలో రాష్ట్రం నుంచి ఏడుగురు ఉపాధ్యాయులు పాల్గొనగా మన జిల్లా నుంచి నాగులుప్పలపాడు మండలానికి చెందిన వై మంజుల పాల్గొన్నారు. సృజనాత్మక బోధనా పద్ధతులను అభివృద్ధి చేయడంపై శిక్షణ ఇచ్చారు. శిక్షణలో పాల్గొన్న వారికి ఎన్‌సీఆర్టీ డైరెక్టర్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అన్యాయం

- పేదల వైద్యంపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం
- ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటుకు అప్పజెప్తారా
- ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ ఆందోళన
- పీపీపీని ఆపకపోతే ఆమరణ దీక్షలకైనా సిద్ధమన్న నాయకులు



ఒంగోలులో అంబేడ్కర్ బొమ్మ వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకులు

ఒంగోలు సబర్బన్: రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ చేయటం అన్యాయమని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జీ.దేవ ప్రసాద్ ఆధ్వర్యంలో ఒంగోలులో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత ప్రకాశం భవన్ ఎదురుగా ఉన్న మహానేతలు జగజ్జీవన్ రామ్, బీఆర్.అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాదిగ మాట్లాడుతూ పేద పిల్లల వైద్య విద్యకు అడ్డుపడుతున్న కూటమి ప్రభుత్వాన్ని తరిమికొట్టాలన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను, వాటికి అనుసంధానంగా ఉండే ప్రభుత్వ వైద్యశాలలను ప్రైవేటుపరం చేయటం అత్యంత దుర్మార్గమైన చర్యగా ఆయన అభివర్ణించారు. అప్పటి ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్కాపురంలో వందల కోట్ల రూపాయలతో వైద్యశాల నిర్మిస్తే దానిని ప్రైవేటుపరం చేయాలని చూడటం పశ్చిమ ప్రకాశం ప్రజలను నిలువునా మోసం చేయటమేనన్నారు. దానికితోడు మార్కాపురాన్ని ప్రత్యేకంగా జిల్లా చేస్తానని ప్రకటించిన చంద్రబాబు నాయుడు మార్కాపురంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీని ప్రైవేటుపరం ఏవిధంగా చేస్తావని ఆయన ప్రశ్నించారు. పేదల వైద్యంపై టీడీపీ కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందన్నారు. పేదలను ప్రైవేటు వైద్యశాలలకు పంపించేందుకే చంద్రబాబు పన్నాగం పన్నాడని, అందుకే ప్రభుత్వ ఆస్తులు అమ్ముకోవాలని చూస్తున్నాడన్నారు.

మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయటం దుర్మార్గమైన చర్యగా ఆయన అభివర్ణించారు. పేద పిల్లల వైద్య విద్యకు అడ్డుపడుతున్న కూటమి ప్రభుత్వానికి నూకలు చెల్లాయన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను, వాటికి అనుసంధానంగా ఉండే ప్రభుత్వ వైద్యశాలలను ప్రైవేటు పరం చేయటమేమిటని దుమ్మెత్తిపోశారు. చంద్రబాబు జీవితం అంతా ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటుపరం చేయటమేనని ఆదెన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలి విడతలోనే మార్కాపురం మెడికల్ కాలేజీని ప్రైవేటుపరం చేయాలని చూడటం జిల్లాలోని పశ్చిమ ప్రకాశం ప్రజలను నిలువునా మోసం చేయటమేనని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవ ప్రసాద్ మాట్లాడుతూ 2019–2024 మధ్యకాలంలో రాష్ట్రంలో 17 కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణానికి అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు పాలనలో ఒక్కటి అంటే ఒక్క మెడికల్ కాలేజీని కూడా స్థాపించలేదని గుర్తు చేశారు. చంద్రబాబు చర్యల వల్ల పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయటమేనని ఆందోళన వ్యక్తం చేశారు. రూ.10 వేల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను కేవలం సంవత్సరానికి రూ.5 వేలకే ప్రైవేటు సంస్థలకు లీజుకు ఇవ్వడం ద్వారా ప్రజల ఆస్తులను దోచుకుంటున్నారని మండిపడ్డారు. కేవలం కమీషన్ల కోసం మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు అమ్మేయటం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. మొత్తం 29 ప్రైవేటు కాలేజీలను ఈ వివరాలివ్వాలని విజిలెన్స్ విభాగం అధికారులు కోరారని అందులో 15 కాలేజీలు స్పందించగా, 6 కాలేజీల యాజమాన్యాలు కొత్తగా వచ్చామని చెప్పారన్నారు.

ఆందోళన కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చిలకా ఇశ్రాయేలు, ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దుడ్డు వినోద్, రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఉన్నం జనార్దన్ రావు (బుజ్జి), ఎస్సీ సెల్ ఒంగోలు పట్టణ అధ్యక్షుడు గోపీ చంద్, నాయకులు మాజీ ఎంపీపీ కే నరసింహారావు, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవరపల్లి రమణ, బి యోహాన్, ఒంగోలు టౌన్ అధ్యక్షుడు గోపీ, కావూరి ఏసోబు, జె.ఇశ్రాయేలు, మధు, కంభంపాటి సన్నిబాబు, జి సామేలు, డగ్లస్, దర్శి నియోజకవర్గ అధ్యక్షుడు జి.ఏసుదాసు, మార్కాపురం నియోజకవర్గ అధ్యక్షుడు ఆదిమూలపు లూకా, పూనూరి దేవదానం, సంతనూతలపాడు నియోజకవర్గం తేళ్ల పుల్లారావు, మద్దిపాడు మండల నాయకులు రాయపాటి విల్సన్, కావూరి యేసోబు, కొనకమిట్ల మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంచికల చిన్న కోటేశ్వర రావుతో పాటు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అనితమ్మా.. చలపతి చౌదరికి క్షమాపణ చెప్పాలి

- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: "ఏపీ హోం మంత్రి అనితమ్మా.. నా నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమాని గుర్రం చలపతి చౌదరిపై మీరు ప్రస్తావించిన వ్యాఖ్యలు వెనక్కు తీసుకొని క్షమాపణ చెప్పాలని" యర్రగొండపాలెం ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. చలపతి చౌదరి కాదని, రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వాడని అనిత చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ సాక్షిగా ఒక అసత్యపు ప్రచారాన్ని మీరు తీసుకొచ్చి, కమ్మ కులంలో కూడా పెరుగుతున్న వ్యతిరేకతను తట్టుకోలేక ఆక్రోశంతో మీ చంద్రబాబు నాయుడు మాటలు నమ్మి చేసిన వ్యాఖ్యలు సరైనవి కావని ఆ బిడ్డకు క్షమాపణ చెప్పాల్సిన అవసరం ఉందని అన్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గం త్రిపురాంతకం మండలంలోని మేడపి గ్రామానికి చెందిన చలపతి కమ్మ కులానికి చెందినవాడని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి, ఆ పార్టీ అధినేత వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి వీరాభిమాని అని అన్నారు. అటువంటి వ్యక్తి మీ ప్రభుత్వంలో జరుగుతున్న తప్పులను, కూటమి నేతలు చేస్తున్న దాడులు, దోపిడీలపై సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టాడని ముందు వెనక చూసుకోకుండా హోం మంత్రిగా బాధ్యతను మరచి దిగజారుడు వ్యాఖ్యలు చేయడం కూటమి ప్రభుత్వ పనితీరు, అవివేకాన్ని ఎత్తి చూపుతున్నాయని అన్నారు.

పూర్తి స్థాయి సమ్మెలోకి ప్రభుత్వ వైద్యులు

- నేటి నుంచి అత్యవసర వైద్య సేవలతో సహా అన్నీ రకాల సేవల బంద్
- ఒంగోలులో నేడు పీహెచ్‌సీ వైద్యుల ప్రదర్శన

ఒంగోలు టౌన్: ప్రాథమిక వైద్యశాలల వైద్యులు నేటి నుంచి పూర్తి సమ్మె మరింత ఉధృతం కానుంది. ఇన్ సర్వీస్ కోటా, ఇతర సమస్యల పరిష్కారం కోసం గత శుక్రవారం నుంచి పీహెచ్‌సీ వైద్యులు సమ్మెబాట పట్టిన సంగతి తెలిసిందే. 6 రోజులుగా విధులకు హాజరవుతున్న వైద్యులు అత్యవసర సేవలు కొనసాగిస్తున్నారు. సాధారణ ఓపీ చూడడం లేదు. ప్రభుత్వంతో జరిపిన చర్చలు విఫలం కావడంతో బుధవారం నుంచి పూర్తిగా వైద్య సేవలను నిలిపివేయనున్నట్లు ఆంధ్ర ప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ రాహుల్ తెలిపారు. పూర్తి స్థాయి సమ్మెలోకి వెళుతున్నట్లు వెల్లడించారు. గతంలో పీహెచ్‌సీ వైద్యులకు ఇన్ సర్వీసు కోటా 30 శాతం ఉండేది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏకపక్షంగా ఆ కోటాను 15 శాతానికి తగ్గించారు.

అప్పట్లో పీహెచ్‌సీ వైద్యులు ఆందోళన చేపట్టడంతో దిగివచ్చిన రాష్ట్ర ప్రభుత్వం దానిని 5 శాతం పెంచి 20 శాతంగా నిర్ణయించారు. దీనిని కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. ఒక ఏడాది కాలం 20 శాతం కోటాను కొనసాగించిన ప్రభుత్వం ఆ తరువాత 15 శాతం అమలు చేస్తోంది. దాంతో పీహెచ్‌సీ వైద్యులు అనేక సార్లు ప్రభుత్వానికి విన్నవించుకున్నా పెడచెవిన పెట్టడమే కాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అనివార్యంగా పీహెచ్‌సీ వైద్యులు సమ్మె బాట చేపట్టారు. ఒక వైపు సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నా పాలకులు వైద్యుల సమ్మె పట్ల కనికరం లేకుండా వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నేడు పీహెచ్‌సీ వైద్యుల ప్రదర్శన..

ఇన్ సర్వీస్ కోటాను 30 శాతానికి పునరుద్ధరించాలని, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వారికి బేసిక్ పే 30 శాతం ట్రైబల్ అలవెన్స్ మంజూరు చేయాలని, నోషనల్ ఇంక్రిమెంట్స్ ఇవ్వాలని, చంద్రన్న సంచార చికిత్స ప్రోగ్రాం కింద రూ.5 వేల అలవెన్స్ ఇవ్వాలని, టైం బౌండ్ ప్రమోషన్లు అమలు చేయాలని కోరుతూ జిల్లాలోని పీహెచ్‌సీ వైద్యులు కలెక్టరేట్ వద్ద ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఏపీపీహెచ్‌సీడీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ రాహుల్ తెలిపారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని, అప్పటి వరకు సమ్మె కొనసాగుతుందని చెప్పారు.



ఫ్యాప్టో ధర్నాను విజయవంతం చేయాలని కర పత్రాలు ఆవిష్కరించిన ఫ్యాప్టో నాయకులు

7న ఫ్యాప్టో ధర్నాను విజయవంతం చేయండి

ఒంగోలు సిటీ: రాష్ట్రంలోని ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలపై ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా ఈనెల 7వ తేదీన విజయవాడ ధర్నా చౌక్‌లో వేలాది మంది ఉపాధ్యాయులతో నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని ఫ్యాప్టో రాష్ట్ర పరిశీలకులు చెన్నుపాటి మంజుల పిలుపునిచ్చారు. ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ ఎస్టీయూ భవన్‌లో సన్నాహక సమావేశం జిల్లా ఫ్యాప్టో చైర్మన్ కాగుటూరి యర్రయ్య అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో రాష్ట్ర పరిశీలకులు చెన్నుపాటి మంజుల మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాల నుంచి తప్పించడం, అధికారంలోకి వచ్చిన వెంటనే మెరుగైన పీఆర్సీ, మధ్యంతర భృతి మంజూరు, సీపీఎస్ స్థానంలో మెరుగైన పెన్షన్ విధానం, ఆర్థిక బకాయిల చెల్లింపు, పెన్షనర్లకు కార్పొరేషన్ ఏర్పాటు వంటి హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి 16 నెలలు పూర్తయినా ఏ ఒక్క హామీ పూర్తి స్థాయిలో అమలు కాలేదని తెలిపారు. రాష్ట్రంలోని 12 లక్షల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించిన ఏ ఒక్క సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించడం గానీ, చర్చించిన పరిస్థితి కానీ లేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు చెల్లించాల్సిన దాదాపు రూ.30 వేల కోట్ల ఆర్థిక బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం రోడ్ మ్యాప్ ప్రకటించాలని కోరినా ఇంతవరకు స్పందన లేదన్నారు. ఫ్యాప్టో చైర్మన్ కాగుటూరి యర్రయ్య మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపాధ్యాయ సంఘాలతో విద్యా రంగ, ఆర్థిక సమస్యలపై చర్చించి పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ జనరల్ ఎస్.కే రఫి, కో చైర్మన్ వీ మాధవరావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎస్ రవి, డీ శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, కార్యవర్గ సభ్యులు చల్లా శ్రీనివాసులు, వై సీనయ్య , కే దేవ సహాయం, బీ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా విస్తృత స్థాయి సమావేశం

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు జిల్లా విస్తృత స్థాయి సమావేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, రీజినల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి పాల్గొంటున్నట్లు తెలిపారు. జిల్లాలో మాజీ ఎమ్మెల్యేలు, రాష్ట్ర పార్టీ కమిటీ సభ్యులు, పార్లమెంట్ సెక్రటరీలు, రాష్ట్ర అనుబంధ విభాగ అధ్యక్షులు, రాష్ట్ర అనుబంధ కమిటీ సభ్యులు, జిల్లా అనుబంధ విభాగ అధ్యక్షులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఇతర నాయకులు పాల్గొనాలన్నారు.

నేటి నుంచి దోర్నాల ఎకో టూరిజం ప్రారంభం

మార్కాపురం: మార్కాపురం అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ పరిధిలోని దోర్నాల శ్రీశైలం మధ్య ఉన్న ఎకో టూరిజం (జంగిల్ సఫారీ)ని బుధవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ అబ్దుల్ రవూఫ్ తెలిపారు. గత మూడు నెలలుగా ఈ సఫారీని మూసివేశారు. పెద్దపులి పునరుత్పత్తి నేపథ్యంలో అటవీ ప్రాంతంలోకి రాకపోకలు నిషేధించారు. బుధవారం నుంచి సందర్శకులను అనుమతించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

యువతిని మోసం చేసిన యువకుడికి రిమాండ్

దొనకొండ: ప్రేమపేరుతో యువతిని మోసం చేసిన యువకుడికి పొదిలి జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ టి.త్యాగరాజు తెలిపారు. వివరాలు.. మండలంలోని మంగినపూడి గ్రామానికి చెందిన డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న యువతిని రెండేళ్ల నుంచి అదే గ్రామానికి చెందిన శిఖా కిరణ్‌కుమార్ ప్రేమించినట్టు నటించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా అనుభవించాడు. యువతి పెళ్లి చేసుకోమని అడగగా ఆ యువకుడు ఆమెను తీవ్రంగా గాయపరిచాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ త్యాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాక్ష్యాధారాలు సేకరించి నిందితుడిని కోర్టుకు హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సు నుంచి పొగలు

- డ్రైవర్ చాకచక్యంతో తప్పిన ప్రమాదం

కురిచేడు: వినుకొండ నుంచి పొదిలి ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు నుంచి పొగలు వచ్చాయి. అప్రమత్తమైన డ్రైవర్ శ్రీనివాసరావు బస్సును నిలిపి ప్రయాణికులను దింపేశారు. వివరాలు.. వినుకొండ ఆర్టీసీ డిపోకు చెందిన ఏపీ 29జెడ్ 0472 నంబర్ గల బస్సు మంగళవారం వినుకొండ నుంచి పొదిలి వెళ్తోంది. మండలంలోని బోధనంపాడు వద్ద ఇంజిన్‌లో మంటలు రావడంతో డ్రైవర్ అప్రమత్తమై వెంటనే బస్సును పక్కకు తీసి నిలిపేశాడు. ప్రయాణికులను బస్సు నుంచి దింపి ప్రమాదం జరగకుండా కాపాడాడు. ప్రయాణికులను వెనుక వచ్చిన బస్సులో గమ్యస్థానాలకు తరలించారు. కాలంతీరిన బస్సులు నడపడం వల్లే ఇల్లా జరుగుతోందని ప్రయాణికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.


ఇంజిన్‌ను పరిశీలిస్తున్న డ్రైవర్ శ్రీనివాసరావు


బస్సుకోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

హైలెవల్ వ్యాపారం

- హైదరీ క్లబ్‌లో పచ్చదనం హననం
- పర్యావరణానికి తూట్లు పొడుస్తున్న నిర్వాహకులు
- వందల సంవత్సరాల నాటి చెట్లు నిలువునా నరికివేత
- వైద్య విధాన పరిషత్ స్థలం 53 సెంట్లు యథేచ్ఛగా కబ్జా
- బాధ్యులపై చర్యలకు ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ డిమాండ్


గత కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ నాయకులు




హైదరీ క్లబ్ ప్రాంగణంలో నరికిన భారీ చెట్లు

ఒంగోలు సబర్బన్: బాధ్యతాయుతమైన హోదాల్లో ఉన్న ప్రముఖులు నిబంధనలకు పాతరేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు పాటుపడాల్సింది పోయి నిలువునా పాతరేస్తున్నారు. కలెక్టర్, ఎస్పీలు కమిటీ సభ్యులుగా ఉన్న హైదరీ క్లబ్ నిర్వాహకులది ఇష్టారాజ్యమైంది. కలెక్టరేట్‌కు అతి సమీపంలో ఉన్న హైదరీ క్లబ్ ప్రాంగణంలో వందల సంవత్సరాల నాటి చెట్లను నిలువునా నరుకుతున్నారు. పచ్చదనానికి మారుపేరుగా ఉండే హైదరీ క్లబ్‌ను కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వ్యాపారాల కేంద్రంగా, జూదాలకు ఆలవాలంగా మార్చారు. క్లబ్‌లో కార్యదర్శిగా ఉండి.. అధికార పార్టీ అండదండలు దండిగా ఉన్న ఒక ప్రైవేటు వైద్యుడు, కోశాధికారిగా ఉంటూ రెవెన్యూ విభాగంలో కీలక పదవులు నిర్వహించి పదవీ విరమణ చేసిన వ్యక్తి క్లబ్‌లో భారీ వృక్షాలను నేలమట్టం చేసిన వారిలో కీలకంగా వ్యవహరించారు.

వందల సంవత్సరాల చెట్లు నేలమట్టం

హైదరీ క్లబ్ ప్రాంగణంలో వందల సంవత్సరాల నాటి చెట్లు నేలమట్టం చేశారు. రావి, జువ్వి, వేప చెట్లు ఎత్తుకు ఎదిగి ఉండేవి. క్లబ్‌కు కేటాయించిన స్థలం కాకుండా వైద్య విధాన పరిషత్‌కు చెందిన స్థలాన్ని దాదాపు 53 సెంట్లు కబ్జా చేసి మరీ దురాక్రమణకు పాల్పడ్డారు. రిక్రియేషన్ కోసం క్లబ్ ఏర్పాటు చేస్తే దాన్ని వ్యాపార కేంద్రంగా, అక్రమాలకు, జూద క్రీడలతో పాటు ఒక బార్ అండ్ రెస్టారెంట్‌లా తయారు చేశారు. అవన్నీ వాళ్ల అంతర్గత వ్యవహారాలు అనుకుంటే.. పర్యావరణాన్ని నిలువునా హననం చేశారు. అసలు అంత పెద్ద భారీ వృక్షాలను కొట్టేయాల్సిన అవసరం వీళ్లకు ఎందుకు వచ్చింది. స్విమ్మింగ్ పూల్ అని, టెన్నిస్ కోర్టులని కాగితాల్లో చూపించి షాపింగ్ కాంప్లెక్స్ కట్టుకునేందుకు వీళ్లకు ఎవరు అనుమతిచ్చారు. ఒంగోలు నగర పాలక సంస్థ ప్లాన్ అప్రూవల్ ఇవ్వకపోయినా ఏ విధంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారు.

కలెక్టర్, ఎస్పీలకు క్లబ్ కమిటీలో కీలక పదవులు

హైదరీ క్లబ్ కమిటీలో కలెక్టర్‌గా ఎవరున్నా ఆ అధికారి క్లబ్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. మరో అధికారి లా అండ్ ఆర్డర్‌ను తన చేతుల్లో ఉంచుకొనే ఎస్పీ కో ఆప్టెడ్ చైర్మన్‌గా ఉంటారు. జిల్లాని పరిపాలించే ఇద్దరు కీలకమైన అధికారులు హైదరీ క్లబ్ కమిటీలో ఉంటేనే ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి మరీ అక్రమాలకు పాల్పడుతుంటే ఎందుకు కళ్లప్పగించి చూస్తున్నారు. చెట్లు నరకడానికి అటవీ శాఖ అధికారులు అనుమతులు కూడా తీసుకోలేదు.

అక్రమాలు వెలుగులోకి తెచ్చిన 'సాక్షి'

హైదరీ క్లబ్‌లో జరుగుతున్న అక్రమాలను 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. ఈ ఏడాది ఆగస్టు 24వ తేదీన జిల్లా పేజీలో 'కబ్జా విస్తరిస్తూ..కార్పొరేషన్ విస్మరిస్తూ' అంటూ కథనాన్ని ప్రచురించిన విషయం పాఠకులకు విదితమే. అందులో స్పష్టంగా వైద్యవిధాన పరిషత్‌కు చెందిన స్థలాన్ని కబ్జా చేసి మరీ నిబంధనలకు విరుద్ధంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేస్తున్నారని ప్రచురించాం. ఆ తర్వాత హైదరీ క్లబ్ పాలక మండలి అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తూనే ఉన్నాయి. హైదరీ క్లబ్ అక్రమాలపై జిల్లా రెవెన్యూ అధికారి బి.చినఓబులేసు విచారణ చేపట్టారు. అయినా క్లబ్ నిర్వాహకులు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు ఆపనే లేదు. ప్రధానంగా నగర కమిషనర్ కె.వెంకటేశ్వరరావు కమర్షియల్ కాంప్లెక్స్ అక్రమ నిర్మాణం విషయంలో పూర్తిగా సహకరించారన్న విమర్శలూ వినిపిస్తున్నాయి.

కమిటీపై చర్యలు తీసుకోవాలి

హైదరీ క్లబ్ నిర్వాహకులు రూ.100 కోట్ల విలువైన వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ స్థలం కబ్జా చేశారు. సాక్షి దిన పత్రికలో వచ్చిన కథనాన్ని ఆధారంగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం. గత కలెక్టర్ కమిటీలో చైర్మన్‌గా ఉన్నా ఆమెకు తెలియకుండా అక్రమాలు జరిగాయని అధికారులు చెబుతున్నారు. కమిటీలో ఉన్న వారిపై చర్యలు ఎందుకు తీసుకోరు. మీ కోసం కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం. డీఆర్‌ఓను విచారణాధికారిగా నియమించారు. ఈ మొత్తం వ్యవహారంలో నగర కమిషనర్ వెంకటేశ్వరరావు కీలకంగా వ్యవహరించారు.

– చావలి సుధాకర్, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు

బ్రిడ్జి వంతెనను ఢీకొట్టిన లారీ

కొమరోలు: లారీ అదుపు తప్పి బ్రిడ్జి వంతెనను ఢీకొట్టింది. ఈ సంఘటన మండలంలోని అల్లినగరం, తిమ్మారెడ్డిపల్లె గ్రామాల మధ్యలో మంగళవారం జరిగింది. చెన్నై నుంచి అల్లం లోడుతో కంభం వెళుతున్న లారీ అదుపులారీ బ్రిడ్జిపై ఉన్న వంతెన గోడను ఢీకొట్టింది. లారీ అక్కడే ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్, క్లీనర్ క్షేమంగా బయటపడ్డారు. జేసీబీ సాయంతో లారీని బయటకు తీశారు.


వంతెన గోడను ఢీకొట్టిన లారీ

పెరిగిన గుండ్లకమ్మ నీటి ప్రవాహం


చోళ్లవీడు బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గుండ్లకమ్మ

రాచర్ల: భారీ వర్షానికి గుండ్లకమ్మవాగు నీటి ప్రవాహం మరింత పెరిగి ఉధృతంగా ప్రవహిస్తోంది. మండలంలోని చోళ్లవీడు గ్రామ సమీపంలోని బ్రిడ్జి వద్ద గుండ్లకమ్మ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఆకవీడులోని తురకవాని చెరువు, చిన గానిపల్లెలో రంగయ్యానాయుడు చెరువులకు వరదనీరు పెరగడంతో ఆకవీడు, చోళ్లవీడులోని టూటౌన్‌లో మోకాళ్ల లోతు వరదనీరు చేరింది. రోడ్లపై నీరు ప్రవహిస్తుండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.


ఆకవీడులోని ఎస్సీకాలనీ వెళ్లే రోడ్డు మార్గంలో మోకాళ్లలోతు ప్రవహిస్తున్న వరదనీరు

రెండు కిలోమీటర్ల ట్రాఫిక్ జాం

కొండపి: మండల పరిధిలోని కొండపి-అనకర్లపూడి దారిలో రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జాం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ దారిలో రోడ్డు మార్జిన్ పూర్తిగా దెబ్బతినడంతో పక్కనే ఉన్న చేలలోని మట్టితో మార్జిన్ వేశారు. అదే సమయంలో వర్షాలు కురవడంతో వాహనాలు ఎదురై రోడ్డు మార్జిన్‌లో దిగడంతో కొన్ని వాహనాలు ఇరుక్కుపోయాయి. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడి వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. వాహనాలు గంటల తరబడి కదలకపోవడంతో కొండపికి వచ్చే ప్రజలు దాదాపు రెండు కిలోమీటర్లు నడిచి కొండపికి చేరుకున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.


ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన వాహనాలు

అలా పట్టుకొని..ఇలా వదిలేశారు..

జరుగుమల్లి(సింగరాయకొండ): మండల పరిధిలోని సతుకుపాడు వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు భారీ టిప్పర్లను జరుగుమల్లి పోలీసులు మంగళవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. ఈ రెండు ఈ రెండు టిప్పర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించే ప్రయత్నంలో ఒక వాహనానికి పంక్చర్ కావడంతో చిర్రికూరపాడు వద్ద ఉన్న పెట్రోల్‌బంకు వద్ద ఉంచి రెండో టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయితే తరువాత ఏమైందో గానీ పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న టిప్పర్ అక్కడ నుంచి వెళ్లిపోయింది. దీనిపై పోలీసులను అడిగితే ఒక్కో వాహనానికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించామని, రెవెన్యూ అధికారుల ఆదేశాలతో వదిలిపెట్టామని తెలిపారు. అయితే రెవెన్యూ అధికారులు మాత్రం రెండు ట్రిప్పర్లను పట్టుకున్న విషయం చెప్పారని, ఎంత జరిమానా విధించింది, వాటిని వదిలిపెట్టిన విషయం తెలియదని, అసలు కేసులు నమోదు చేశారో కూడా తెలియదని చెప్పడం విశేషం. పట్టుకున్న ఇసుక టిప్పర్లను రెవెన్యూ, మైనింగ్ అనుమతి లేకుండా పోలీసులు ఎలా వదిలేస్తారన్నది ప్రశ్నగా మిగిలింది. ఇసుక మాఫియాపై పోలీసులకు ఎంత కఠినంగా వ్యవహరిస్తున్నారో అర్థమవుతుందని ప్రజలు చర్చించుకుంటున్నారు.


పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న ఇసుక టిప్పర్

భారం కాదు.. బాధ్యత

- సమాజంలో వృద్ధులపై చిన్నచూపు
- మలిసంధ్యలో పట్టించుకునే వారు లేక మనోవేదన
- నేడు అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం



ఒంగోలు వన్‌టౌన్: నవమాసాలు మోసి కని పెంచిన పిల్లలే వృద్ధాప్యంలో అసరాగా ఉంటారనుకుంటే ఆ భాగ్యం తల్లిదండ్రులకు కలగడం లేదు. వృద్ధులు సమాజానికి నాణ్యమైన వారసులు. వారి జ్ఞానం, అనుభవం అమూల్యమైన సంపద. కుటుంబాల్లో సంస్కృతి, సంప్రదాయాలను పెంపొందించడంలో వారిదే కీలక పాత్ర. అయితే మలిసంధ్యలో పట్టించుకునేవారు లేక వృద్ధులు మనో వేదన చెందుతున్నారు.

కుటుంబ విలువలు ప్రశ్నార్థకం..

త్వరితగతిన మారుతున్న సమాజం, ప్రపంచీకరణ, సాంకేతిక పరిజ్ఞానం వల్ల జీవన ప్రమాణాలు పెరిగినా మానవీయ విలువలు క్షీణిస్తున్నాయి. మన-తన అన్న తేడా లేకుండా తల్లిదండ్రులపై దారుణాలకు పాల్పడే వారసుల ఉన్నారు. 'మీరు మీ తల్లిదండ్రులను ఎలా చూస్తారో, మీ పిల్లలు మిమ్మల్ని అలాగే చూస్తారు' అనే సూక్తి యువత స్మరణలోంచి మాయమవుతోంది. ఐక్యరాజ్య సమితిలెక్కల ప్రకారం 2050 నాటికి దేశ జనాభాలో 21 శాతం వృద్ధులు ఉంటారని ఒక అంచనా. దీంతో భారత ప్రభుత్వం 1999లో జాతీయ వృద్ధుల విధానాన్ని రూపొందించింది. ఈ విధానాన్నే రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అనుసరించాలని ఆదేశించింది.

వృద్ధులకు సదుపాయాలు తప్పనిసరి.

జాతీయ వృద్ధుల విధానంలో భాగంగా వృద్ధులు జీవితాన్ని సజావుగా గడిపేందుకు అనువైన వాతావరణ పరిస్థితులు కల్పించాలి. ఆరోగ్య సదుపాయాలు కల్పించాలి. రాయతీలు పొందేందుకు 60 ఏళ్లు పైబడిన వారు అర్హులు. పన్నుల చెల్లింపులో రాయితీ, బ్యాంకులో డిపాజిట్లపై అధిక వడ్డీ, అనాథలైన వృద్ధుల ఆస్తులకు పూర్తి రక్షణ కల్పించాల్సి ఉంది. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అధ్వర్యంలో వృద్ధులకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. అవాస యోజన పథకం ద్వారా పెద్దలకు గృహాల మంజూరు, రైల్వే రిజర్వేషన్‌లలో రాయితీ, ప్రయాణ టికెట్లలో 30 శాతం రాయితీలు, విమాన ప్రయాణ టికెట్లలో 50 శాతానికి పైగా రాయితీలు ప్రభుత్వం కల్పిస్తుంది. ఆర్టీసీ బస్సుల్లో 25 శాతం రాయితీతో ప్రయాణం, రెండు సీట్లను వృద్ధులకు రిజర్వ్ చేస్తారు. జిల్లాలో మొత్తం జనాభాలో దాదాపు 20 శాతానికి పైగా వృద్ధులు ఉన్నారు. జిల్లాలో ప్రభుత్వ సహాయంతో మూడు వృద్ధాశ్రమాలు నడుస్తున్నాయి. వీటన్నింటిని ఉపయోగించుకుని వృద్ధులు కొంత వరకైనా ఆశ్రయం పొందవచ్చు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 15 వరకు వృద్ధాశ్రమాలు ఉన్నా వాటిలో ఎక్కువగా చీరాల, బాపట్ల పరిసరాల్లో ఉండటంతో ప్రకాశం జిల్లాలో 3 వృద్ధాశ్రమాలు మాత్రమే ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. మరికొన్ని వృద్ధాశ్రమాలు ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలని వృద్ధులు కోరుతున్నారు.


సీతారామ పురంలోని సమతా వృద్ధాశ్రమం

రోజుకు రూ.54తో ఎలా..?

ఒంగోలులోని సీతారామపురంలో నడుస్తున్న సమతా వృద్ధాశ్రమంలో ప్రస్తుతం 25 మంది వృద్ధులు ఉంటున్నారు. ప్రభుత్వం వారి ఆహార ఖర్చుల కోసం రోజుకు ఒక్కొక్కరికి రూ.54 మాత్రమే విడుదల చేస్తోంది. ప్రస్తుతం పెరిగిన నిత్యావసర ధరలతో పోషకాహారం కలిగిన ఆహారం ఈ ధరకు అందించడం చాలా కష్టంగా ఉందని ఆశ్రమ అధికారులు చెబుతున్నారు.

వయోవృద్ధుల సంక్షేమానికి చర్యలు

వయోవృద్ధుల సంక్షేమానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో ప్రభుత్వ-స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నడిచే మూడు వృద్ధాశ్రమాలు ఉన్నాయి. ఒంగోలులో రెండు, కనిగిరిలో ఒక వృద్ధాశ్రమం ఉంది. కేంద్ర ప్రభుత్వం వృద్ధాశ్రమంలో ఉండే వృద్ధుల పోషణ ఖర్చులకు నిధులు విడుదల చేస్తోంది.

– సీహెచ్ సువార్త, వయోవృద్ధుల శాఖ ఏడీ

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో విఫలం

- జీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు పర్రె వెంకటరావు


మాట్లాడుతున్న బీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు పర్రె వెంకటరావు

ఒంగోలు సిటీ: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించటంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు పర్రె వెంకటరావు అన్నారు. బీటీఏ జిల్లా కార్యాలయంలో మంగళవారం బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు కర్ర దేవసహాయం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు పర్రె వెంకటరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు పూర్తయినా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించటంలో ఘోరంగా విఫలమైందన్నారు. అధికారంలోకి రాకముందు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఉద్యోగులకు ఉన్న ఆర్థిక, సర్వీసు సమస్యలు ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పరిష్కరిస్తామని చెప్పిన నాయకులు ఇప్పుడు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. 11 వ పీఆర్‌సీ టైం ముగిసి రెండేళ్లు పూర్తయినా కనీసం వేతన సవరణ కమిటీ వేయడానికి కూడా ప్రభుత్వం సుముఖంగా లేకపోవడం శోచనీయమన్నారు. బకాయిలు మొత్తం చెల్లిస్తామని నమ్మబలికి అధికారంలోకి వచ్చాక ఆ ఊసే లేకపోవడం చూస్తే ఏమనుకోవాలి, సరెండర్ లీవులు చెల్లించకపోవడం, రిటైర్డ్ అయిన ఉపాధ్యాయులకు బెనిఫిట్ లు చెల్లించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి 12 వ పీఆర్‌సీ కమిషన్ నియమించి, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఏల్చూరి మాధవరావు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 4 డీఎలను విడుదల చేయాలని, 11 వ పీఆర్సీ, సీపీఎస్ వారికి 90 శాతం చెల్లించాల్సిన డీఏ బకాయిలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యోగ, ఉపాధ్యాయులు ఉద్యమబాట పట్టి కూటమి ప్రభుత్వానికి కూడా బుద్ధి చెబుతారన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఎం.శరత్ చంద్రబాబు మాట్లాడుతూ 2004 ముందు చేరిన ఉద్యోగులకు పాత పెన్షన్ అమలు కోసం సెంట్రల్ గవర్నమెంట్ ఇచ్చిన మెమో 57 అమలు, కోర్టు కేసులు క్లియర్ అయిన లాంగ్వేజ్ పండితుల పదోన్నతులు చేపట్టకపోవడం బాధాకరం అని, వెంటనే అమలు చేయాలని కోరారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డీ మాల్యాద్రి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలు అప్పగించరాదని యాప్‌ల భారం తగ్గించాలని ప్రభుత్వాన్ని బీటీఏ పక్షాన డిమాండ్ చేశారు. అక్టోబర్ 7వ తేదీ జరిగే రాష్ట్ర ఫ్యాప్టో ధర్నా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా నాయకులు పల్లె తిరుపతి స్వామి, కొండమోరి కొండల రాయుడు, బొంత కళ్యాణ్, అల్లరి విజయ్ కుమార్ తదితరులు మాట్లాడారు.

ఉద్యోగ విరమణతో కొత్త జీవన అధ్యాయం

- ఎస్పీ హర్షవర్ధన్ రాజు


ఏఆర్ ఏఎస్పీ శ్రీనివాసరావుని సన్మానిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

ఒంగోలు టౌన్: ఉద్యోగ విరమణతో జీవితంలో కొత్త అధ్యాయం మొదలవుతుందని ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు అన్నారు. సుదీర్ఘకాలం ఉద్యోగ జీవితంలో ఒత్తిడితో గడిపిన పోలీసు అధికారులు ఇప్పుడు కుటుంబసభ్యులతో సంతోషంగా గడపాలని సూచించారు. మంగళవారం ఉద్యోగ విరమణ చేసిన ఏఆర్ అడిషనల్ ఎస్పీ కొల్లూరు శ్రీనివాసరావును పోలీసు కళ్యాణ మండపంలో ఘనంగా సన్మానించారు. శాలువాకప్పి జ్ఞాపికను బహూకరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ సుదీర్ఘకాలం 34 ఏళ్లు వివిధ స్థాయిలో సేవలందించిన కొల్లూరి శ్రీనివాసరావు పోలీసు శాఖకు, ప్రజలకు ఎంతో సేవ చేశారని గుర్తు చేశారు. రిటైర్మెంట్ అనేది ఉద్యోగానికి మాత్రమే ఉంటుందని, వ్యక్తిత్వానికి ఉండదని చెప్పారు. విధి నిర్వహణలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని, కఠిన పరిస్థితులను కూడా సులువుగా అధిగమించి విజయవంతంగా ఉద్యోగ బాధ్యతలు పూర్తి చేయడం స్ఫూర్తిదాయకమన్నారు. పోలీసు ఉద్యోగిగానే కాకుండా రచయితగా, కవిగా, గాయకుడిగా కూడా కొల్లూరు శ్రీనివాసరావు రాణించారని, నేటి తరానికి స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఎస్బీ సీఐ రాఘవేంద్ర, డీసీఆర్బీ సీఐ దేవ ప్రభాకర్, తాలుకా సీఐ విజయకృష్ణ, వన్‌టౌన్ సీఐ నాగరాజు, ఆర్ఐలు రమణారెడ్డి, సీతారామిరెడ్డి, ఏఆర్ ఎస్సైలు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

- పీహెచ్‌సీల్లో అంతరాయం లేకుండా వైద్య సేవలు

ఒంగోలు సబర్బన్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు వైద్య సేవల్లో అంతరాయం కలగకుండా అవసరమైన అన్నీ చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీలో పనిచేసే వైద్యుల సమ్మె నేపథ్యంలో జిల్లాలోని 64 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన వైద్యులను జీజీహెచ్ నుంచి, కమ్యూనిటీ వైద్యశాలల నుంచి కేటాయిస్తూ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ పర్యవేక్షణకు ఒంగోలు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో కంట్రోలు రూంను ఏర్పాటు చేశామన్నారు. కంట్రోల్ రూంకు 1077, 08592-281400 ఫోన్ నంబర్లను కేటాయించామన్నారు.